ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

- సర్దుబాటులో బదిలీ అయిన ఇద్దరు ఉపాధ్యాయులు
- 90 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులే
- ఖాదరబాద్ మండల పరిషత్ ఉర్దూ పాఠశాల దుస్థితి


ఒకేతరగతి గదిలో కూర్చున్న నాలుగు తరగతుల విద్యార్థులు



ఖాదరబాద్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని ఖాదరబాద్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో సరైన బోధన అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో క్రమంగా ఈ పాఠశాలను అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 1 నుంచి 8 తరగతి చదువుతున్న 90మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి ఇద్దరు ఉపాధ్యాయులే వారికి విద్యాబోధన చేస్తున్నారు వీరు కూడా సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులే. జూన్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పదవీ విరమణ చేయడంతో ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించారు. ప్రభుత్వం చేపట్టిన పని సర్దుబాటు వల్ల ఆ ఇద్దరు ఉపాధ్యాయులు బడి నుంచి వెళ్లిపోయారు.

ఇద్దరు ఉపాధ్యాయులతో బోధన

పాఠశాలలో కనీసం 5 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులే విధులు నిర్వహిస్తున్నారు. 6, 7, 8 తరగతులకు స్కూల్ అసిస్టెంట్స్ బోధించాల్సి ఉండగా సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులతోనే విద్యాబోధన కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించినా ఉర్దూ పాఠశాలల్లో తగినంత మంది ఉర్దూ ఉపాధ్యాయులు లేకపోవడం విచారకరం. ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు రికార్డులు రాయడం, పాఠశాల నిర్వహణకే ఎక్కువ సమయం కేటాయించాల్సి రావడంతో బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నారు. అరకొర బోధనతో విద్యార్థుల నష్టపోతుండటంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉర్దూ పాఠశాలలపై వివక్ష

ఉర్దూ పాఠశాలల పట్ల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను నియమించకుండా వివక్ష ప్రదర్శిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం, సరైన బోధన అందకపోవడం తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పిస్తుండగా, కొందరు పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై ఎంఈఓ సావిత్రమ్మ దృష్టికి తెచ్చిన సమస్య పరిష్కారం కాలేదు. ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేంత వరకు విద్యవాలంటీర్లను నియమించి బోధన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



పాఠశాలలో 90 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికి ఇద్దరు ఉపాధ్యాయులే విద్యాబోధన చేయడం కష్టంగా ఉంది. విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి. అంతవరకు విద్యావలంటీర్లను అయినా నియమించి విద్యాబోధన చేయించాలి.

\- అబ్దుల్, ఎస్ఎంసీ చైర్మన్, ఖాదరబాద్

త్వరలో టీచర్లను నియమిస్తాం



మండలంలో ఉర్దూ ఉపాధ్యాయులు చాలా తక్కువగా ఉన్నారు. డీఈఓ పరిధిలో ఉర్దూ ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరగాల్సి ఉంది. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నచోట పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

\-సావిత్రమ్మ, ఎంఈఓ, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

ఐదుగురికి రిమాండ్

కాశినాయన : మండలంలో మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. వీరికి బద్వేలు జడ్జి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు.

గోదాము ప్రారంభం


గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

చాపాడు : వ్యవసాయం చేసుకుని పంటలు పండించి ధాన్యం నిల్వ చేసుకునే రైతులకు ఉపయుక్తంగా ఉండేలా గోదామును వినియోగించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రాజువారిపేటకు చెందిన వెన్నపూస విజయ్‌వర్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గోదామును ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, వేమారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శారద, కిషోర్‌కుమార్‌రెడ్డి, నారపురెడ్డి, హర్ష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డేవిడ్‌రాజ్



పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శామ్యూల్ డేవిడ్‌రాజ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

మద్యం బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి


ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో విచ్చల విడిగా మద్యం బెల్టు షాపులను ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గద్దం నరసింహులు, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులో ప్రతి మద్యం షాపు రోజు ఉదయం 5 గంటల నుంచి ఓపెన్ చేస్తూ ప్రభుత్వ అనుమతి లేకుండా పర్మిట్ రూముల మాదిరి విక్రయాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వెంటనే ఎక్సైజ్ సీఐ మద్యం షాపులు, బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సహదేవరెడ్డి



రాజుపాళెం : భారతీయ కిసాన్ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజుపాళెం మండలానికి చెందిన ఉమ్మడి సహదేవరెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో జరిగిన బీకేఎస్ జాతీయ సమావేశంలో ఆశాఖ జాతీయ నాయకులు జలగం కుమార స్వామి, శ్రీధర్ రెడ్డి, రాము, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర రెడ్డి, రాంబాబు అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో ఎన్నికయ్యారని వారు తెలిపారు. ఈయన గతంలో వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా సహదేవ రెడ్డి మాట్లాడుతూ బీకేఎస్‌లో జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని రైతుల సమస్యలకోసం పోరాటం చేసేవాడినన్నారు. దీంతో తనను గుర్తించి తనకు మరింత పెద్ద బాధ్యతలను అప్పగించిందన్నారు. తప్పకుండా తన బాధ్యతలను నెరవేర్చుతానని ఆయన చెప్పారు.

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు


ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రైవేటు పాఠశాలలకు చెందిన 15 బృందాలు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 22 బృందాలు పోటీలో పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నూరు ఎంఈఓ ఎస్‌సునీత, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇవి వారి జ్ఞానాన్ని ఇనుమడింపజేస్తాయన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సమాజంలో శాస్త్రీయతను కాపాడుకోవాలన్నారు. విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని, మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, అధ్యక్షులు సమీర్ బాష, సృజన్, ప్రతినిధులు సుబ్బయ్య, పల్లా వెంకటేశ్వర్లు, సునీత, అరుణ, ఎస్తేర్ రాణి, రంగనాయకులు పాల్గొన్నారు.

అనాథకు ఆశ్రయం

కాశినాయన : మండలంలోని సగిలేరు ఒడ్డున ఉన్న సేవాశ్రమానికి 80 ఏళ్ళ వృద్ధుడు వచ్చి ఇక్కడ ఆశ్రయం కల్పించాలని నిర్వాహకులను కోరాడు. ఆయన మాటల్లోనే అవధూత కాశినాయన స్వగ్రామం బెడుసుపల్లె మా ఊరు. ఆయన నాకు వరసకు దాయాది సోదరుడు. ఆయనకు వరుసకు దాయాది అయిన సోదరుడి కుమారుడను నేను. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో దిక్కు తోచక దేశాటన చేశాను. బ్రహ్మంగారి తత్వాలు పాడుకుంటూ భిక్షాటన చేస్తూ కాలం గడిపాను. బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన రవ్వలకొండలో జీవనం సాగిస్తూ ఉండిపోయాను. రాను రాను అక్కడ నాకు ఇబ్బంది అనిపించడంతో నా పెద్దనాన్న కాశినాయన సమాధి చెంతకు చేరి కొంత కాలం జ్యోతిక్షేత్రంలో ఉన్నాను. నా వయస్సు 80 సంవత్సరాలు. ఇక ఓపిక లేక సగిలేరు ఒడ్డున ఆశ్రమం ఉందని తెలుసుకుని ఇక్కడికి వచ్చానన్నారు. ఆయనను సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డి చేరదీసి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు.


అనాథ వృద్ధుడిని చేరదీసిన రామకృష్ణారెడ్డి

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు


చాపాడు పోలీసుస్టేషన్‌లో బెల్టు షాపు నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ శివశంకర్

చాపాడు : మండలంలోని గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని మైదుకూరు రూరల్ సీఐ శివ శంకర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకూ స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి మండలంలోని ఆయా గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహించే వారిని పిలిపించి రూరల్ సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పల్లెల్లో బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం అమ్మితే కఠినమైన కేసులు నమోదు చేస్తామన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే బైండోవర్ చేసిన సమయంలో తహసీల్దారు వద్ద ఇచ్చిన పూచికత్తు మేరకూ లక్షకు పైగా డబ్బులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇదే క్రమంలో బెల్టు షాపులకు సహకరించే వైన్స్ షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఇప్పటికే పల్లెల్లో ప్రత్యేక నిఘా ఉంచామని ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని మానుకోవాలి


మాట్లాడుతున్న నేట్లపల్లె శివరామ్

మైదుకూరు : విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లె శివరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఎన్నికల ప్రచార హామీల్లో భాగంగా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే సర్దుబాటు చార్జీల పేరిట రూ.6,072 కోట్లు విద్యుత్ భారాన్ని పేద, మధ్య తరగతి ప్రజలపై మోపడం శోచనీయమన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నోటిఫికేషన్ జారీని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల.. మరో పక్క ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం అమానుషమని పేర్కొన్నారు. 2022 - 23లో వాడిన కరెంట్‌కు ఈ నవంబర్ నెల నుంచి 2026 జనవరి వరకు యూనిట్‌కు దాదాపు రూ.1.62 అదనంగా చెల్లించాలని విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ చెప్పడం వినియోగదారులకు పెను భారం అని తెలిపారు. చంద్రబాబు మాట తప్పి ప్రజలపై వేసిన ట్రూ ఆప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ చంద్రబాబు నాయుడు 41 శాతం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని గుర్తు చేశారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన పాలకులు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి దండోపాయంతో ప్రభుత్వాలు నడుపుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2027లో దేశవ్యాప్తంగా జెమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలనేది బీజేపీ అజెండా వ్యూహంగా ఉందన్నారు. పేదరిక నిర్మూలనకు బడ్జెట్ కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ కమిటీ సభ్యులు, పార్టీ శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

47 బాణసంచా దుకాణాలు ఏర్పాటు


ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని మోడంపల్లె పరిధిలో దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని 47 బాణసంచ దుకాణాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది 46 దుకాణాలు ఉండగా ఈ ఏడాది మరో రెండు బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేయాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ గంగయ్య తెలిపారు. ప్రతి ఏడాది మాదిరే ఈ ఏడాది కూడా అదే ప్రాంతంలో బాణసంచా దుకాణాలకు అనుమతి మంజూరు చేశామన్నారు. లైసెన్స్ లేకుండా పట్టణంలో ఎవరూ బాణసంచా విక్రయాలు చేపట్టరాదన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం బోర్డు పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న నాగ సుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి పేనంపై నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరతతో పనులు లేకపోవడం, మరొపక్క కరోనాతో అల్లాడిపోయి ఆకలితో 32 మంది కార్మికులు బలైపోయారన్నారు. రాష్ట్రంలో అనేకమంది అప్పుల పాలై ఊరు విడిచి ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం గెలిస్తే ఇసుక పాలసీని మారుస్తామని, అందరికీ ఇసుక ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి భవన నిర్మాణ కార్మికుల ఆదుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది కార్మిక ప్రయోజనాల కోసం ఏర్పడిన సంక్షేమ బోర్డు నిధులు, విధులు, వినియోగం,పై చర్చించి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గం అన్నారు. కొత్త ఇసుక పాలసీని పెట్టారని, అందరికీ ఇసుక ఉచితమే అంటూ ప్రకటించినా ఇసుక ఉచితంగా రావడం లేదన్నారు. రాష్ట్రంలో 110 ఇసుక ర్యాంపులు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ఓపెన్ చేశారని మిగతా 34 రీచ్‌లలో ఎక్కడ ఇసుక స్టాక్ లేక వెలవెల బోతున్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో మీకు ఇసుక ఇస్తామని చెప్పారు. కానీ 48 గంటలు గడచినా ఆన్‌లైన్ ఓపెన్ కాలేదన్నారు. లారీ ఇసుక రూ.21 వేలు, ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు వరకు పలుకుతోందన్నారు. నిన్న మొన్నటి వరకు ఇసుక పైన జీఎస్టి పన్ను, సీనరేజ్, ఇతర ఫీజు వసూలు చేశారన్నారు. ఈ సమస్యలన్నిటిపై రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 11న జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఆందోళనలకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మద్దిలేటి, లింగన్న బాలాజీ, నాగేశ్వరరావు,రమేష్, మస్తాన్ , వీరేష్ గౌడ్, రవి, మున్నా, శశి పాల్గొన్నారు.

నేటి నుంచి 'దివాళి విత్ మై భారత్'

వైవీయూ : భారత ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, క్రీడామంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో ‹దివాళి విత్ మై భారత్› పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నెహ్రూయువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. మై భారత్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుమార్కెట్, సర్వజన ఆసుపత్రి శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కర్ణాటక న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కర్ణాటక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీ రాష్ట్ర మాల మహానాడు జాకట విజయశేఖర్‌వర్గం రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల కన్నా అత్యున్నత రాజ్యాంగం చాలా గొప్పదని మరోసారి కొనియాడుతున్నామన్నారు. కర్ణాటకలోని కొప్పల్ జిల్లా సెషన్స్ న్యాయస్థానం 98 మందికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ప్రివెన్స్‌స్ యాక్టు-1959లో జీవిత ఖైదీలుగా విధిస్తూ ఇచ్చిన సంచలన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కొప్పలి జిల్లా పోలీసు యంత్రాంగం ఈ కేసులో పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ ఆధారంగా ఇంతమందకి శిక్ష పడిందని, ఈ విషయంలో కర్ణాటక పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

హిందువులను ఏకతాటిపై నడిపించడమే లక్ష్యం


పథసంచలనంను ప్రారంభిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు


పథ్ సంచాలన్ చేస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

బద్వేలు అర్బన్ : ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై జరుగుతున్న దాడులను నియంత్రించి హిందువులందరిని ఏకతాటిపై నడిపించడమే విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల లక్ష్యమని ఆర్ఎస్ఎస్ నాయకులు సత్యనారాయణ తెలిపారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆదివారం పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పథసంచలనం నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా సిద్దవటం రోడ్డు, పోరుమామిళ్ల రోడ్డు, మైదుకూరు రోడ్డుల మీదుగా సాగిన పథసంచలనంలో ఆయన మాట్లాడుతూ హిందువులంతా కులాలకు, వర్గాలకు, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా ఉండి హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండకార్యవాహ రాజశేఖర్‌రెడ్డి, నగర కార్యవాహ ఈశ్వరయ్య, బీజేపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ బొమ్మనసుబ్బరాయుడు, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, బలిజ సేవా సంఘం అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఎస్ నాయకులు కొండపల్లిసుభాష్‌కుమార్, సంజీవరెడ్డి, నరసింహ, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, వెంకటయ్య, సుధాకర్, శశిధర్‌కుమార్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో పథ్ సంచాలన్

మైదుకూరు : పట్టణంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పథ్ సంచాలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ 99 ఏళ్లు పూర్తి చేసుకుని నూరో సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా మైదుకూరు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆర్ఎస్ఎస్ సభ్యులు గణవేష్ ధరించి నాలుగు రోడ్లలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ నేతల చిత్రపటాలను అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

ఘనంగా ఆర్ఎస్ఐ పథ సంచలన్

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 99 ఏళ్లు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పట్టణంలో పథ సంచలన్ నిర్వహించారు. స్థానిక గీతాశ్రమం నుంచి ప్రారంభమైన ఈ పథ సంచలన్ గాంధీ రోడ్డు, విజయకుమార్ సర్కిల్, టీబీ రోడ్డు, రాజీవ్ సర్కిల్, పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుని శ్రీరాములపేట మీదుగా తిరిగి గీతాశ్రమంకు చేరింది. ఈసందర్భంగా ఆర్ఎస్ఎస్ కడప జిల్లా కార్యవాహక్ ప్రసాద్ మాట్లాడుతూ కడప, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని 35 కేంద్రాల్లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాయం 'వరి'ంచేనా..!


కేసీ పరిధిలో వరినాట్లు వేస్తున్న కూలీలు


ట్రాక్టరుతో విత్తన సాగు చేస్తున్న రైతులు


కుందూనది కింద సాగులో ఉన్న వరి పంట


కేసీ చాపాడు కాలువలో ప్రవహిస్తున్న నీరు

రాజుపాళెం మండలంలోని కుందూనది, కేసీ చాపాడు కాలువ కింద ఆగస్టు, సెప్టెంబరులో రైతులు జోరుగా వరి విత్తనం, వరి నాట్లు వేశారు. అయితే ఈ ఏడాది కాస్త ముందుగానే వర్షాలు కురిశాయి. శ్రీశైలం రిజర్వాయరుకు నీరు పూర్తిస్థాయిలో రావడంతో నీరు వస్తుందని ఇక వరి పంట సాగు చేసుకోవచ్చునని సంబంధిత ఇరిగేషన్ అధికారులు చెప్పడంతో రైతులంతా నాట్లు వేశారు. మండలంలోని కుందూనది, కేసీ చాపాడు కాలువ కింద 1976 ఎకరాల్లో వరి పంట సాగులో ఉంది. గతేడాది వర్షాలు పడక ఆరుతడి పంటలను సాగు చేశారు. ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం మరింత పెరిగింది. ప్రస్తుతం బస్తా ధాన్యం రూ.1650 (బీపీలు రకం) ఉన్నాయి. ఖర్చులు ఎక్కువైనా ధరలు, దిగుబడి బాగా రావాలని కోటి ఆశలతో ఈ పంటను సాగు చేస్తున్నట్లు అక్కడి రైతులు చెబుతున్నారు.

\- రాజుపాళెం

అనాథకు అంతిమసంస్కారం

కడప అర్బన్ : ఖాజీపేట పోలీస్‌స్టేషన్ వారి విన్నప మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి కడప నగరానికి చెందిన శ్రీ కాశీ విశ్వనాథసేవాసమితి ఆధ్వర్యంలో సేవామూర్తులు ఆదివారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈనెల 19న ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లి గ్రామంలో రోడ్డు హైవే దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. కొన ఊపిరితో వున్న అతడనిన 108లో రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌లో మృతి చెందాడు. ఖాజీపేట పోలీసువారు చుట్టు పక్కల గ్రామాల వారిని విచారించారు. అతనికి బంధువులుగా ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియల కోసం శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. సేవా మూర్తులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రాఘవేంద్ర, టైలర్ రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అతిథులు

కడప కల్చరల్ : కడప నగరం సబ్ జైలు వద్ద ఉన్న మదరసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో ఆదివారం విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం)వారి జీవిత చరిత్రపై రాత పరీక్ష పోటీ విజేతలకు, విద్యార్థులకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ఎం ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సయ్యద్ అజ్మతుల్లా బియబాని, షఫీ, రిటైర్డ్ ఆర్.జె.డి ఏ పిచ్చయ్య చౌదరి, గౌరవ అతిథులుగా జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అడ్వైజరీ సభ్యులు కెఎండి సుభాన్, మద్రసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ నాజిమ్ ముఫ్తి అబ్దుల్ వదీద్ నదివి, ఆఫ్సర్ ఖాన్ ఫౌండేషన్ డైరెక్టర్ కె ఆఫ్సర్‌ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే చదువుతో పాటు ఆధ్యాత్మికాన్ని అలవర్చుకోవాలన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్ బాబు భాయ్ తదిరులు పాల్గొన్నారు.